సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 14 । నవంబర్ । 2023



దీపారాధన.. ఉపవాసం

నేటి నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాసానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ నెలలో ఆలయాలు, ఇళ్లలో ప్రత్యేక పూజలు చేస్తారు. 12లో



భద్రగిరిలో త్రిముఖ పోటీ ?

భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, సీపీఎం మధ్య త్రిముఖ పోటీ నెలకొనే అవకాశం ఉందని తెలుస్తోంది. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
32° / 21°

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. రాత్రికి వాతావరణం చల్లగా మారుతుంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- ఎన్నికల పరిశీలకులు కమల్‌కిషోర్



పోలింగ్ కేంద్రంలో పరిశీలిస్తున్న కమల్ కిషోర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు ఏర్పాటుచేయాలని కొత్తగూడెం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు కమల్ కిషోర్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటర్ల కోసం సురక్షిత తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం ర్యాంపులు, వీల్‌చైర్లు సిద్ధంగా ఉంచాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. నూతన ఓటర్లకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించి సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో లైజన్ అధికారి జినుగు మరియన్న, డీటీ అంజద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

జాప్యం లేకుండా పనులు నిర్వహించాలి



నివేదికలు పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో మన ఊరు – మన బడి పథకంలో ఎంపికైన పాఠశాలల్లో పనులు జాప్యం లేకుండా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరాచారి అన్నారు. దుమ్ముగూడెం, గుండాల, దమ్మపేట మండలాల్లో మన ఊరు – మన బడి కార్యక్రమం కింద ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సోమవారం ఆయన కొత్తగూడెంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనుల్లో ఎక్కడైనా జాప్యం జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అంతకుముందు ఆయా పాఠశాలల్లో ఇప్పటివరకు చేపట్టిన పనుల ఫొటోలతో కూడిన నివేదికలను ప్రధానోపాధ్యాయులు డీఈఓకు అందజేశారు. సమావేశంలో జిల్లా ప్లానింగ్ కో–ఆర్డినేటర్ ఎస్.సతీష్‌కుమార్, మూడు మండలాల విద్యాశాఖాధికారులు, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి బాధ్యత నాదే..

బీఆర్‌ఎస్‌ను గెలిపించే బాధ్యత మీది

- గోదావరికి ఇరువైపులా కరకట్టలు
- రూ.1,000 కోట్లతో అంచనాలు సిద్ధం
- ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్



బూర్గంపాడు మండలం లక్ష్మీపురం సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన అభ్యర్థులు రేగా కాంతారావు, తెల్లం వెంకట్రావు, వనమా, ఎంపీలు నామా, వద్దిరాజు, పార్థసారథిరెడ్డి, కవిత తదితరులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరి వరదల నుంచి రక్షణ కల్పించేందుకు నదికి ఇరువైపులా కరకట్టలు నిర్మిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. కరకట్టల నిర్మాణానికి ఇప్పటికే రూ.1000 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని తెలిపారు. బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. 'ఇక్కడ మీరు ఓట్లేసి పినపాక నుంచి రేగా కాంతారావును, భద్రాచలం నుంచి తెల్లం వెంకట్రావును గెలిపిస్తే రాష్ట్రంలో మన ప్రభుత్వం వస్తుంది. ఆ తర్వాత ఇక్కడికి వచ్చి రెండు రోజులు ఉండి, శ్రీరాముడిని దర్శించుకోవడంతో పాటు అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతా. ఈ నియోజకవర్గాల అభివృద్ధి బాధ్యత నాది, వీరిద్దరి గెలుపు బాధ్యత మీది' అని సీఎం కేసీఆర్ ప్రజలను ద్దేశించి అన్నారు.

జ్వరాలు మాయం..

ఒకప్పుడు వానాకాలం వస్తే 'మంచం పట్టిన మన్యం' అంటూ పత్రికల్లో వార్తలు వచ్చేవని, పక్కనే గోదావరి ఉన్నా తండాలకు, గిరిజన గూడేలకు తాగునీరు కరువయ్యేదని కేసీఆర్ గతాన్ని గుర్తు చేశారు. అప్పటి ప్రభుత్వాలకు గిరిజనులు మనుషుల్లా కనిపించలేదని, అందుకే వారి ఆలనా పాలనా పట్టించుకోలేదని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక బీఆర్‌ఎస్ పాలనలో మిషన్ భగీరథ పథకం అమలు చేసి ప్రతీ ఇంటికి శుభ్రమైన తాగునీరు అందించామన్నారు. భద్రాచలం నియోజకవర్గంలో వానాకాలం వస్తే వాగులు నిండి ఆస్పత్రులకు పోవడం కష్టంగా ఉండేదని, హై లెవల్ వంతెనల నిర్మాణంతో ఆ కష్టాలు దూరమయ్యాయని చెప్పారు. ఒక్క పినపాక నియోజకవర్గంలోనే 14 వేల కుటుంబాలకు 57 వేల ఎకరాల భూములకు పట్టాలు అందించామన్నారు. పోడు కేసులు ఎత్తివేయడంతో పాటు రైతుబంధు అందిస్తున్నామని తెలిపారు.

పైలట్ ప్రాజెక్టుగా దళితబంధు..

కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా దళితబంధు అమలు చేస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. గతంలో మైదాన ప్రాంత నియోజకవర్గాల్లో 100 శాతం లబ్ధిదారులకు దళితబంధు అమలు చేశారని, ఏజెన్సీలో ఉన్న పినపాకలోనూ పైలట్ ప్రాజెక్టుగా ఇవ్వాలని విప్ రేగా కాంతారావు కోరగా సీఎం సానుకూలంగా స్పందించారు. మళ్లీ ప్రభుత్వం రాగానే పినపాకతో పాటు భద్రాచలంలోనూ 100 శాతం లబ్ధిదారులకు దళితబంధు అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

రాజుగారు చెప్పగానే..

ఏజెన్సీలో ఉండే తండాలు, ఆదివాసీ గూడేల ప్రజలు త్రీ ఫేస్ కరెంట్ లేక ఇబ్బంది పడుతున్నారని భద్రాచలం దగ్గర ఉండే ఓ రాజుగారు తనతో చెప్పారని, వెంటనే రూ.300 కోట్లు మంజూరు చేయించి అన్ని ఆదివాసీ గూడేలు, తండాలకు త్రీ ఫేస్ విద్యుత్ ఇచ్చేలా ఏర్పాట్లు చేశామని కేసీఆర్ తెలిపారు.

వనమా గారూ.. చెయ్యెత్తాలి

ధరణి పోర్టల్ ఉంచాలా ? రద్దు చేయాలా ? అంటూ సభికులను కేసీఆర్ ప్రశ్నించారు. ఉంచాలి అనే వాళ్లు చెయ్యి ఎత్తాలని కోరారు. ఈ సందర్భంగా సభికుల నుంచి సానుకూల స్పందన వచ్చింది. అందరూ చేతులు పైకి లేపారు. దీంతో రెట్టించిన ఉత్సాహంతో వేదికపై ఉన్న వారు కూడా చెయ్యి ఎత్తి తమ అభిప్రాయం తెలపాలని సీఎం కేసీఆర్ అన్నారు. ఆ వెంటనే కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు వైపు చూస్తూ 'వనమా గారూ.. మీరు చెయ్యి ఎత్తాలి' అని అన్నారు. ఆయా సభల్లో ఎంపీలు నామా నాగేశ్వరరావు, బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తాతా మధు, కొత్తగూడెం, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట అభ్యర్థులు వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, తెల్లం వెంకట్రావు, మెచ్చా నాగేశ్వరరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ



లక్ష్మీపురం సభకు హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు

సైడ్‌లైట్స్..

- సీఎం కేసీఆర్ మధ్యాహ్నం 2.20 నిమిషాలకు దమ్మపేట మండలం మల్లారంలోని సభా వేదిక వద్దకు చేరుకున్నారు.
- 2.30 నుంచి 2.52 నిమిషాల వరకు ప్రసంగించారు.
- టెంట్ లేకపోవడంతో సభకు వచ్చిన వారంతా ఎండలోనే కూర్చున్నారు.
- సీఎం రాకముందు మధుప్రియ, మానుకొండ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆటపాటలు ఆకట్టుకున్నాయి.
- సభలో కేసీఆర్‌తో పాటు ఎంపీ నామా, అశ్వారావుపేట అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు మాత్రమే మాట్లాడారు.
- సభ అనంతరం ట్రాఫిక్ జామ్ కావడంతో దాదాపు రెండున్నర గంటలపాటు వాహనాలు ముందుకు కదల్లేదు. దీంతో పలువురు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

సీఎం సమక్షంలో చేరికలు

దమ్మపేట: సీఎం కేసీఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పలువురు ముఖ్య నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి, వగ్గెల పూజ, వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు సోయం వీరభద్రం తదితరులకు సీఎం గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు సమక్షంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా ప్రసాద్, కాంగ్రెస్‌కు చెందిన మాజీ జెడ్పీటీసీ అంకత మల్లికార్జునరావు, బాణోతు పద్మావతి, చల్లా రమేష్, దోసపాటి రాంబాబు, వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు కొనకళ్ల శ్రీనివాస్, తాండ్ర రాంబాబు తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఆట పాటలతో సందడి



పాటకు స్టెప్పులేస్తున్న ఎంపీలు వద్దిరాజు, కవిత, విప్ రేగా కాంతారావు

బూర్గంపాడు/దమ్మపేట : బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో సోమవారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ రాక ముందు ఎంపీలు మాలోత్ కవిత, వద్దిరాజు రవిచంద్ర, విప్ రేగా కాంతారావుతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు ఆటపాటలతో సందడి చేశారు. గాయకుడు ఏపూరి సోమన్న పాటలకు వీరంతా నృత్యం చేసి కార్యకర్తల్లో జోష్ నింపారు. దమ్మపేట మండలం మల్లారం సభలోనూ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గాయని మధుప్రియతో కలిసి స్టెప్పులు వేశారు.

పార్టీ చరిత్ర తెలుసుకుని ఓటెయ్యాలి

అశ్వారావుపేట : ఎన్నికల్లో ఎంతో మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని, వారి వెనుక ఉన్న పార్టీల చరిత్ర తెలుసుకుని ఓటెయ్యాలని సీఎం కేసీఆర్ ప్రజలను కోరారు. దమ్మపేట మండలం మల్లారంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. పరిణతి చెందిన దేశాలు అభివృద్ధిలో దూసుకెళ్తున్నాయని, మనం ఇంకా పరిణతి చెందాల్సిన అవసరం ఉందని అన్నారు. మంచివాళ్లను ఎన్నుకుంటే అది అభ్యర్థి గెలుపు కాదని, ప్రజలే గెలిచినట్టని, తద్వారా పాలనలో సత్ఫలితాలు వస్తాయని చెప్పారు. గతంలో హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగా ఉంటే ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా సమైక్యాంధ్రలో కలిపారని, ఆ ఘనత కాంగ్రెస్ నాయకులదేనని విమర్శించారు. 1969 ఉద్యమంలోనూ 400 మందిని కాల్చి చంపారని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాకముందు మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ జిల్లాల నుంచి భారీగా వలసలు వెళ్లేవారని, ఇప్పుడా పరిస్థితి లేదని వివరించారు. రాష్ట్రంలో ఇప్పుడు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని, ప్రధాని నరేంద్రమోదీ సొంత రాష్ట్రంలోనూ ఇలా లేదని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతి సెంటు భూమినీ సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు.

పోడు కేసులు ఎత్తేశాం..

అశ్వారావుపేట నియోజకవర్గంలో 26 వేల ఎకరాల పోడు భూములకు పట్టాలిచ్చి రైతుబంధు, రైతు బీమా పథకాలు అమలు చేస్తున్నామని, పోడు కేసులను ఎత్తేశామని సీఎం కేసీఆర్ తెలిపారు. నియోజకవర్గానికి డిగ్రీ కళాశాల, 100 పడకల ఆస్పత్రి, డయాలసిస్ సెంటర్, మరో పామాయిల్ ఫ్యాక్టరీ కూడా వచ్చాయని తెలిపారు. సౌమ్యుడు, వివాదరహితుడైన మెచ్చా నాగేశ్వరరావును భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.



దమ్మపేట మండలం మల్లారం సభలో మాట్లాడుతున్న కేసీఆర్, పక్కన మెచ్చా

16 నామినేషన్ల తిరస్కరణ

పూర్తయిన పరిశీలన

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో దాఖలైన 136 నామినేషన్ల పరిశీలన ప్రక్రియను రిటర్నింగ్ అధికారులు సోమవారం పూర్తి చేశారు. వీటిలో 120 నామినేషన్లను ఆమోదించగా వివిధ కారణాలతో 16 తిరస్కరించారు. ఎక్కువ నామినేషన్లు దాఖలైన కొత్తగూడెం నియోజకవర్గంలో 36 నామినేషన్లకు రెండు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఇల్లెందు నియోజకవర్గంలో 34 నామినేషన్లు దాఖలు కాగా, నాలుగు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. పినపాక నియోజకవర్గంలో 25 నామినేషన్లకు గాను మూడు తిరస్కరించగా 22 ఆమోదించారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో 23 నామినేషన్లు దాఖలు కాగా రెండు తిరస్కరించి, 21 నామినేషన్లకు ఆమోద ముద్ర వేశారు. భద్రాచలం నియోజకవర్గంలో 18 నామినేషన్లు దాఖలు కాగా 5 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 13 నామినేషన్లు ఆమోదించారు. ఇక ఉపసంహరణకు ఈనెల 15 వరకు గడువు ఉంది.

నామినేషన్ల వివరాలిలా..

నియోజకవర్గం	మొత్తం నామినేషన్లు	ఆమోదం	తిరస్కరణ
కొత్తగూడెం	36	34	2
ఇల్లెందు	34	30	4
పినపాక	25	22	3
అశ్వారావుపేట	23	21	2
భద్రాచలం	18	13	5
మొత్తం	136	120	16

ఉపసంహరణ తరువాత తుది జాబితా..

జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో మొత్తం 136 మంది అభ్యర్థులు 211 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వీటిలో 16 నామినేషన్లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. ఈనెల 15వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఆ తర్వాత తుది జాబితా ప్రకటిస్తాం.

నోరు ఆడిస్తూ ప్రయాణం!

- ఏసీ బస్సుల్లో మిల్లెట్ స్నాక్స్ సరఫరా
- మూడు రకాల చిరుతిండ్లతో ప్యాకెట్
- గరుడ ప్లస్, రాజధాని బస్సుల్లో అమలు
- చార్జీకి అదనంగా మరో రూ.30 వసూలు



ప్రయాణికులకు మిల్లెట్ స్నాక్స్ అందిస్తున్న సిబ్బంది



ప్యాకెట్లలో ఉండే స్నాక్స్

చుంచుపల్లి: గడిచిన రెండేళ్లుగా టీఎస్ ఆర్టీసీ సరికొత్త ఆలోచనలతో సంస్థలో ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తూ ఆదాయాన్ని పెంచుకుంటోంది. ప్రయాణికులను ఆర్టీసీ వైపునకు ఆకర్షించేలా వినూత్న కార్యక్రమాలు చేపడుతోంది. దీంతో ప్రయాణికుల నుంచి ఆదరణ పెరిగి అన్ని డిపోల పరిధిలో ఆదాయం గణనీయంగా పెరిగింది. అటు అధికారులు నెలవారీ లక్ష్యాలు పెట్టుకుని మరీ బస్సులు తిప్పుతుండడంతో కొంత మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. నిరంతరం ప్రయాణికులను తన వైపు ఆకర్షించడమే లక్ష్యంగా సాగుతున్న ఆర్టీసీ ప్రైవేటు రవాణా వ్యవస్థకు దీటుగా మెరుగైన సేవలు అందించేలా అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఆర్టీసీలో జీవా వాటర్ పేరుతో ప్రయాణికులకు తాగునీరు అందజేస్తుండగా.. ఇప్పుడు ఏసీ బస్సుల్లో ప్రయాణికులకు మిల్లెట్ స్నాక్స్ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా గతనెల 16 నుంచి గరుడ, గరుడ ప్లస్, రాజధాని బస్సుల్లో వీటిని అందజేస్తున్నారు. దీనికి ప్రయాణికుల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని అధికారులు చెబుతున్నారు. ఏసీ బస్సుల్లో సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఈ స్నాక్స్ ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అంటున్నారు. మంచి స్పందన వస్తుండడంతో సూపర్ లగ్జరీ బస్సుల్లోనూ ప్రవేశపెట్టాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే ఈ స్నాక్స్ కోసం వసూలు చేస్తున్న అదనపు చార్జీలు భారంగా ఉన్నాయని కొందరు ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు.

ప్రయాణికుల నుంచి ఫీడ్ బ్యాక్

ఖమ్మం రీజియన్ పరిధిలో ఏడు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. ఖమ్మం డిపో పరిధిలో 4 గరుడ ప్లస్ ఏసీ బస్సులు నడుస్తున్నాయి. రాజధాని ఏసీ బస్సులు సత్తుపల్లి డిపో పరిధిలో 3, భద్రాచలంలో 6, ఖమ్మం డిపో పరిధిలో 23 నడుస్తున్నాయి. మణుగూరు, కొత్తగూడెం, మధిర, ఇల్లెందు డిపోల్లో ఏసీ బస్సులు అందుబాటులో లేవు. టీఎస్ ఆర్టీసీ మూడు నెలల క్రితం మిల్లెట్ స్నాక్స్‌ను అంతర్రాష్ట్ర ఏసీ సర్వీసుల్లో అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వాటిలో ప్రయాణికుల నుంచి మంచి స్పందన రావడంతో జిల్లాల పరిధిలో తిరిగే ఏసీ బస్సుల్లోనూ అందుబాటులోకి తెచ్చింది. ఆర్టీసీ ఏసీ బస్సుల్లో టికెట్ తీసుకోగానే ప్రయాణికుడికి డ్రైవర్ ఓ మిల్లెట్ ప్యాకెట్ ఇస్తారు. ట్రూ గుడ్–ఆర్టీసీ సంయుక్తంగా ఈ స్నాక్స్ ప్యాకెట్లను రూపొందించాయి.

అదనంగా రూ.30

స్నాక్స్ ప్యాకెట్లలో చిరుధాన్యాలతో రూపొందించిన చిక్కి, రస్క్, కారా, టిష్యూ పేపర్ ఉంటాయి. 25 గ్రాముల కారప్పూస, పప్పుచెక్క, సేగు (ఇవి ఒక్కో ప్యాకెట్‌లో ఒక్కోరకం ఉంటుంది), 20 గ్రాముల మిల్లెట్ చిక్కీ, ఒక రస్క్‌తో కూడిన విడివిడి ప్యాకెట్లు ఉంటాయి. ఈ మిల్లెట్ స్నాక్స్‌కు చార్జీలో అదనంగా రూ.30 కలిపి తీసుకుంటున్నారు. ఈ ప్యాకెట్లను ప్రయాణికులకు అందించినందుకు డ్రైవర్‌కు రూ.50 పైసల చొప్పున చెల్లిస్తున్నారు. ఐక్యరాజ్య సమితి 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో మంచి ఆరోగ్యాన్ని అందించే ఈ స్నాక్స్‌ను ఆర్టీసీ ప్రయాణికులకు అందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. తద్వారా సంస్థకు కూడా అదనపు ఆదాయం సమకూరుతోందని అంటున్నారు.

టికెట్‌తో పాటు స్నాక్స్ అందిసున్నాం



ఆర్టీసీలో ఏసీ బస్సుల్లో ప్రయాణించే ప్రతి ఒక్కరికీ టికెట్ తీసుకోగానే మిల్లెట్ స్నాక్స్ ప్యాకెట్‌ను అందిస్తున్నాం. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇది ప్రయోజనకరంగా ఉంది. ఇందుకు సాధారణ టికెట్ ధరపై అదనంగా రూ.30 చెల్లించాల్సి ఉంది. ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారి నుంచి వీటి విషయంలో ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నాం.

– నర్సయ్య గౌడ్, డ్రైవర్, భద్రాచలం

అన్ని ఏసీ బస్సుల్లో అమలు



యాజమాన్యం ఆదేశాల మేరకు ఆర్టీసీ ఏసీ బస్సుల్లో అక్టోబర్ 16 నుంచి ప్రయాణికులకు మిల్లెట్ స్నాక్స్ అందజేస్తున్నాం. డిపోల పరిధిలోని గరుడ, గరుడ ప్లస్, రాజధాని బస్సుల్లో స్నాక్స్‌ను అందుబాటులో ఉంచాం. టికెట్‌తో పాటు డ్రైవర్ వీటిని అందజేస్తారు. స్నాక్స్ కోసం అదనంగా రూ.30 చెల్లించాల్సి ఉంటుంది. స్నాక్స్ పంపిణీపై స్పందన లభిస్తోంది.

– సీహెచ్.వెంకన్న, ఆర్టీసీ ఆర్‌ఎం

ఊరంతా వెలుగులే..



కొత్తగూడెంలో కాకరవత్తులు కాలుస్తూ సంబరాలు చేసుకుంటున్న మహిళలు

దీపావళి పండుగను జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వారంతా సొంతూర్లకు చేరుకోగా, పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రతి ఒక్కరూ బాణసంచా కాల్చుతూ సంతోషంగా గడిపారు. చిన్నారులు, మహిళలు క్రాకర్స్‌తో పాటు చిచ్చుబుడ్లు వెలిగించి సందడి చేశారు. ఇక ప్రతి ఇంటి లోగిలిలో దీపాలు వెలిగించడంతో వెలుగులు విరజిమ్మాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయగా, ఇళ్లలోనూ పలువురు లక్ష్మీపూజలు, వ్రతాలు జరుపుకున్నారు.

అప్పట్లో అభ్యర్థికో ఇనుప పెట్టె

సుజాతనగర్: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో ప్రస్తుతం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రా(ఈవీఎం)లను వినియోగిస్తున్నారు. ఈ విధానం ద్వారా ఎలాంటి హడావుడి లేకుండా ఎన్నికలు సజావుగా సాగుతున్నాయి. 1952, 1957 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులకు ప్రత్యేకంగా ఇనుప పెట్టెలను ఏర్పాటు చేశారు. ఓటర్లు విధిగా అభ్యర్థికి కేటాయించిన పెట్టెల్లోనే ఓట్లు వేసేవారు. ఎన్నికల సంస్కరణల్లో భాగంగా 1962లో నిర్వహించిన ఎన్నికల్లో పోలింగ్ బూత్‌కు ఒక పెట్టె ఏర్పాటు చేశారు. బూత్‌లోని ఓటర్ల సంఖ్య ఆధారంగా ఇనుప పెట్టెలను ఎన్నికల సిబ్బంది నార సంచుల్లో తీసుకొని వాహనాల్లో వారికి కేటాయించిన గ్రామాలకు వెళ్లేవారు. క్రమంగా ఎలక్ట్రానిక్ యంత్రాల వినియోగం ఆరంభం కావడంతో ఓటింగ్‌లో సమూల మార్పులు చోటుచేసుకున్నాయి.

మీది గూగుల్ పేనా... ఫోన్ పేనా?!

నేలకొండపల్లి: ఎన్నికల్లో ప్రతీ ఓటు కీలకమే కావడంతో ఎవరిని కూడా వదులుకునేందుకు అభ్యర్థులు సిద్ధంగా లేరు. ఇప్పటికే గ్రామాల వారీగా ఓటర్ల వివరాలు సేకరించి వారు అందులో ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఫోన్ నంబర్లు కూడా తీసుకున్నారు. పోలింగ్ సమీపిస్తుండడంతో రోజుకు కొంత మంది చొప్పున ఓటర్లకు ఫోన్ చేసి రాను, పోను చార్జీలతో పాటు ఇతర ఖర్చులు కూడా భరిస్తామని, తప్పకుండా వచ్చి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. అంతేకాక ఫోన్ పే ఉందా, గూగుల్ పే ఉందా అని ఆరా తీసి ముందుగానే డబ్బులు చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు.

సినీ నటుడు సుమన్ వాహనం తనిఖీ



సుమన్ కారులో తనిఖీ చేసిన అధికారులు

కొణిజర్ల: ఎన్నికల వేళ రహదారులపై ప్రయాణిస్తున్నది ఎవరైనా సరే వాహనాలను పోలీసులు నిశితంగా తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా సినీనటుడు సుమన్ ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా మండలంలోని చెక్‌పోస్ట్ వద్ద అధికారులు కారులో తనిఖీ నిర్వహించారు. పంచాయతీ రాజ్ ఏఈ రమేష్ ఆధ్వర్యాన పోలీసులు తనిఖీ చేపట్టగా... సుమన్ కారుదిగడంతో స్థానికులు ఆయనతో ఫొటోలు దిగారు.



మధుప్రియ పాటకు స్టెప్పులేస్తున్న మెచ్చా, నాయకులు



దమ్మపేట మండలం మల్లారంలో జరిగిన బీఆర్‌ఎస్ సభకు హాజరైన ప్రజలు

గులాబీ సందడి..

అశ్వారావుపేట, భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో సోమవారం గులాబీ సందడి నెలకొంది. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం, దమ్మపేట మండలం మల్లారంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలకు సీఎం కేసీఆర్ హాజరుకాగా, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సభకు ముందు కళాకారులు ఆటపాటలతో సందడి చేశారు. కళాకారులతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు నృత్యాలు చేస్తూ హుషారెత్తించారు.

–సాక్షి నెట్‌వర్క్



మణుగూరు–బీటీపీఎస్ బంజర రోడ్డులో ర్యాలీ..



బైక్‌పై సంక్షేమ పథకాలతో ప్రచారం..




నృత్యం చేస్తున్న కళాకారులు



బీఆర్‌ఎస్ శ్రేణుల ఆనందోత్సాహం..

భద్రగిరిలో త్రిముఖ పోటీ..?

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎంలలో పీఠం ఎక్కేదెవరో..
- ఓటు బ్యాంకు మెరుగు కోసం బీజేపీ పాట్లు
- గత ఎన్నికల్లో 2 వేల లోపు ఓట్లూ..



భద్రాచలం: భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలో మళ్లీ త్రిముఖ పోటీ నెలకొనే పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడి నుంచి 18 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎం, బీజేపీ తదితర పార్టీల అభ్యర్థులతోపాటు స్వతంత్ర, ప్రధాన పార్టీల డమ్మీ అభ్యర్థులు కూడా ఉన్నారు. 18 నామినేషన్లలో ఎన్నికల అధికారులు ఐదింటి ని తిరస్కరించగా, 13 నామినేషన్లను ఆమోదించారు.

గత ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ 11,785

2018లో కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య, ప్రత్యర్థి వెంకట్రావు మీద 11,785 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2018లో మొత్తం 1,10,445 ఓట్లు పోలవగా, వీరయ్యకు 47,746, తెల్లం వెంకట్రావుకు 35,961, సీపీఎం అభ్యర్థి మిడియం బాబూరావుకు 14,228, బీజేపీ అభ్యర్థి కుంజా సత్యవతికి 1824కు, బీఎస్పీ అభ్యర్థి గుండు శరత్‌కు 835 ఓట్లు, నోటాకు 2,106 ఓట్లు నమోదయ్యాయి. వాజేడు మండలంలో బీఆర్‌ఎస్‌కు స్వల్ప ఆధిక్యత, వెంకటాపురం, చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల్లో కాంగ్రెస్‌కు ఆధిక్యత లభించింది. అయితే ఈసారి దుమ్ముగూడెం మండలానికి చెందిన తెల్లం వెంకట్రావు, కారం పుల్లయ్యలు పోటీలో ఉండటంతో దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో ఎవరు ప్రభావం చూపుతారనే ఆసక్తి నెలకొంది.

ఓటింగ్ పెరుగుతుందని బీజేపీ ఆశలు

గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సత్యవతి కేవలం 1,824 ఓట్లను సాధించారు. అయితే ఆమె ఆకస్మిక మరణంతో ఆమె భర్త కుంజా ధర్మాకు బీఫాంను అందచేశారు. గత ఎన్నికల కంటే బీజేపీ ఓటు బ్యాంక్ మెరుగుపడుతుందని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. భద్రాచలం అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించటం, అభివృద్ధిపై చిత్తశుద్ధి చూపడం తమకు అక్కరకు వస్తుందని, అదేవిధంగా సత్యవతి మరణం సానుభూతి ఓట్లుగా మలుస్తుందని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. దీంతో బీజేపీకి గతంలో వచ్చిన విధంగా నోటా కంటే తక్కువగా వస్తాయా, లేదా ఓటింగ్ పెరుగుతుందా చర్చ సాగుతోంది.

2018 ఎన్నికల్లో భద్రాచలం నియోజకవర్గంలో మొదటి మూడు స్థానాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎం అభ్యర్థులు ఉన్నారు. వీరిలో కాంగ్రెస్ తరఫున పొదెం వీరయ్య, బీఆర్‌ఎస్ నుంచి తెల్లం వెంకట్రావు, సీపీఎం నుంచి మిడియం బాబూరావులు ఉండగా, నాలుగో స్థానంలో బీజేపీ అభ్యర్థి కుంజా సత్యవతి నిలిచారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల నుంచి అదే పొదెం వీరయ్య, తెల్లం వెంకట్రావులు ఉండగా, సీపీఎం నుంచి కారం పుల్లయ్య బరిలో దిగారు. కుంజా సత్యవతి మృతి చెందడంతో బీజేపీ నుంచి ఈసారి ఆమె భర్త కుంజా ధర్మా పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి కూడా కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎంల నడుమ మళ్లీ త్రిముఖ పోటీ నెలకొనే పరిస్థితి కనిపిస్తోంది.

జంగ్ తెలంగాణ

బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమే..

ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు

దమ్మపేట: ప్రస్తుతం జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు గెలుపు ఖాయమేనని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. దమ్మపేట మండలం మల్లారంలో సోమవారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. గడిచిన పార్లమెంట్ ఎన్నికల్లో అశ్వారావుపేట నియోజవకర్గం నుంచి జిల్లాలోనే తనకు అత్యధిక మెజారిటీ దక్కిందని, అదే విధంగా మెచ్చాకు కూడా ఓట్లు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.50 వేల కోట్లతో అభివృద్ధి చేశామని, దాంట్లో భాగంగానే సీతారామ ప్రాజెక్టు సైతం నిర్మిస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

కేసీఆర్ చొరవతోనే పోడు పట్టాలు..

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోడు హక్కు పత్రాలు సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతోనే సాధ్యమైందని అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ పోడు పట్టాల పంపిణీతో జిల్లాలో అశ్వారావుపేట నియోజవర్గంలోని గిరిజనులకే అత్యధిక మేలు జరిగిందన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా రూ.5కోట్ల వ్యయంతో బోర్లు, పైపులైన్లు, మోటార్లు ఏర్పాటు చేసి, సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న డిగ్రీ కళాశాల, వంద పడకల ఆస్పత్రి, డయాలసిస్ సెంటర్, సెంట్రల్ లైటింగ్ వంటి అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. మరోసారి తనకు అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

తాటి.. మంచి నిర్ణయం తీసుకున్నవ్..

అభినందించిన సీఎం కేసీఆర్

తాటి.. మంచి నిర్ణయం తీసుకున్నవ్.. నిన్ను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా.. అని సీఎం కేసీఆర్ అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లుతో అన్నారు. సోమవారం దమ్మపేట మండలం మల్లారంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు ప్రసంగిస్తుండగా సభావేదికపై సీఎం కేసీఆర్ తన పక్కనే కూర్చుని ఉన్న తాటి వెంకటేశ్వర్లుతో మాట్లాడారు.



తాటితో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

– అశ్వారావుపేట

రూ.30 వేల కోట్లతో అభివృద్ధి



మాట్లాడుతున్న విప్ రేగా

ప్రజా ఆశీర్వాద సభలో ప్రభుత్వ విప్ కాంతారావు

బూర్గంపాడు: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో పినపాక నియోజకవర్గంలో రూ. 30వేల కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని ప్రభుత్వ విప్, పినపాక అభ్యర్థి రేగా కాంతారావు అన్నారు. లక్ష్మీపురంలో సోమవారం జరిగిన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలోని పేద దళితులందరికీ పైలెట్ ప్రాజెక్ట్‌గా దళితబంధు ఒకేసారి ఇవ్వాలని కోరారు. మణుగూరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని, ఏజెన్సీలో పేద విద్యార్థుల కోసం మణుగూరులో పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని, గోదావరి వరదలతో ప్రతి ఏటా జరుగుతున్న నష్టాలను నివారించేందుకు కరకట్ట పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విన్నవించారు. వరద బాధిత కుటుంబాలకు మెరక ప్రాంతాలలో ఇళ్లు నిర్మించాలని కోరారు. బూర్గంపాడు, అశ్వాపురం మండలాలల్లోని సర్వే నెం 90, 97, 262లలోని సుమారు 8వేల ఎకరాల భూములకు పట్టాహక్కులు కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అసైన్డ్, పోడు భూముల సాగుదారులకు పట్టాహక్కులు ఇప్పించాలని కోరారు. బీటీపీఎస్, సింగరేణి, భారజల కర్మాగారం, ఐటీసీ పీఎస్‌పీడీ వంటి పరిశ్రమల్లో పనిచేస్తున్న వేలాదిమంది అసంఘటిత కార్మికుల వేతనాలను పెంచేందుకు జీఓ తీసుకురావాలని, ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కాగా ఈ డిమాండ్లపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.

ఎన్నికల ఏర్పాట్లపై పరిశీలకుల ఆరా

సత్తుపల్లి: కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన జనరల్ అబ్జర్వర్ సత్యేంద్రసింగ్ సోమవారం సత్తుపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి కార్యాలయం, స్ట్రాంగ్‌రూంలను సందర్శించిన ఆయన పోలీస్‌స్టేషన్‌లో అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికల ఏర్పాట్లపై సూచనలు చేయడంతో పాటు పోలింగ్ పూర్తయ్యే వరకు ప్రశాంత వాతావరణం నెలకొనేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారి అశోక్‌చక్రవర్తి, ఏసీపీ రామానుజం, సీఐలు మోహన్‌బాబు, హనూక్ పాల్గొన్నారు.

పక్కాగా లెక్కతేల్చండి..

సత్తుపల్లిటౌన్: అభ్యర్థుల వ్యయాన్ని పక్కాగా నమోదు చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాజీవ్‌కుమార్‌సింగ్ సూచించారు. సత్తుపల్లిలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంతో పాటు మేడిశెట్టివారిపాలెంలోని చెక్‌పోస్టులో రికార్డులు తనిఖీ చేసిన ఆయన అన్ని వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని తెలిపారు. అధికారులు ఏ.నాగేశ్వరరావు, కిషోర్ పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న వ్యయ పరిశీలకులు రాజీవ్‌కుమార్‌సింగ్

క్లుప్తంగా

కోల్ ట్రాన్స్‌పోర్టర్స్ అధ్యక్షుడు బెదిరిస్తున్నాడు

పోలీసులకు ఫిర్యాదు చేసిన లారీల యజమానులు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టు కోల్‌ట్రాన్స్‌పోర్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి తమను బెదిరిస్తున్నాడని టేకులపల్లి టిప్పర్, లారీ ఓనర్స్ యూనియన్ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం యూనియన్ సభ్యులు ఇస్లావత్ గణేష్, బిచ్చు, శ్రీను, రాంబాబు, లక్ష్మణ్, జానీ, నాగరాజు తదితరులు మాట్లాడుతూ అసోసియేషన్ బలోపేతానికి, సౌకర్యాల కల్పన కోసం లోకల్, నాన్ లోకల్ లారీల (బాడీ బండ్లు) నుంచి రూ.100 చొప్పున వసూలు చేస్తున్నామని తెలిపారు. ఈ విషయం తెలిసిన కోల్ ట్రాన్స్‌పోర్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లోకల్ లారీలకు లోడింగ్ ఇవ్వకపోగా, ఆదివారం తమకు ఫోన్ చేసి బెదిరించాడని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కులం పేరుతో దుర్భాషలాడుతున్నాడని పేర్కొన్నారు. ఈ మేరకు రక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చిప్స్ ప్యాకెట్ కోసం వెళ్లి బాలుడి మృతి

నీటి తొట్టిలో పడడంతో కన్నుమూత

నేలకొండపల్లి: ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడిన నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. మండలంలోని మంగాపురం తండా గ్రామానికి చెందిన గుగులోత్ సురేష్–స్వప్న కుమారుడు సుశాత్‌రామ్(4) సోమవారం ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా, తల్లి ఇంట్లో పని చేస్తోంది. సుశాత్ కోసం తెచ్చిన చిప్స్ ప్యాకెట్ గాలికి ఎగిరెళ్లి నీటి తొట్టిలో పడింది. దీంతో బాలుడు నీటి తొట్టిలోకి వంగి తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు పడి ప్రాణాలు కోల్పోయాడు. కాసేపటికి బయటికి వచ్చిన తల్లి నీటిలో మునిగిన సుశాత్‌ను బయటకు తీసేసరికి మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

బాణసంచా స్వాధీనం

కామేపల్లి: మండల పరిధిలోని పండితాపురం గ్రామంలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న బాణసంచా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలోని దిండిగల శబరినాథ్ నుంచి రూ.35వేల విలువైన బాణసంచా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,196

ఆటో, బైక్‌లను ఢీకొట్టిన లారీ

ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తి మృతి

మణుగూరు టౌన్: మండలంలోని సీఎస్పీ కాంటా ప్రాంత శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఆదర్శ్‌నగర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు దేవేందర్ రెడ్డి (65) ఆదివారం ఉదయం మోటార్‌సైకిల్‌పై బీటీపీఎస్ వైపు నుంచి మణుగూరు వస్తున్నాడు. అదే సమయంలో మణుగూరు ఓసీ–2 నుంచి బొగ్గు లోడ్‌తో బీటీపీఎస్‌కు వెళ్తున్న లారీ సీఎస్‌పీ కాంటా వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. అనంతరం మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో దేవేందర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మణుగూరు డీఎస్పీ రాఘవేందర్ రావు, ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని 100 పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి భద్రాచలం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన దేవేందర్‌రెడ్డి

వ్యక్తి ఆత్మహత్య

జూలూరుపాడు: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యచేసుకున్న ఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై బి.తిరుపతిరావు కథనం ప్రకారం.. మండలంలోని వీరభద్రాపురం గ్రామానికి చెందిన చందా రమేష్(32), అనంతారం గ్రామానికి చెందిన నిరోష పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కొంతకాలం తర్వాత రమేష్ మద్యానికి బానిసై భార్య, పిల్లలను పట్టించుకోకుండా తిరుగుతున్నాడు. భార్యను ఇబ్బందులకు గురి చేయడంతో ఐదేళ్ల క్రితం ఆమె పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లి, అక్కడే ఉంటోంది. భార్యాపిల్లలు లేని జీవితం తనకొద్దని, చనిపోతానంటూ రమేష్ అప్పుడప్పుడు అంటుండగా తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు వారిస్తున్నారు. ఈ క్రమంలో దీపావళి పండుగ రోజు ఆదివారం రాత్రి గ్రామ శివారులో వ్యవసాయ పొలాల వద్ద రమేష్ పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడి ఉండగా, కుటుంబసభ్యులు, స్థానికులు కలిసి జూలూరుపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

అశ్వాపురం: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో రైలు ఢీకొని సోమవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. మణుగూరు మండలం పగిడేరు గ్రామానికి చెందిన సింగరేణి ఉద్యోగి సున్నం పాపయ్య (35) వెంకటాపురం గ్రామంలో బంధువుల ఇంటికి రెండు రోజుల క్రితం వచ్చాడు. సోమవారం ఉదయం పొలాలకు వెళ్తున్న రైతులు రైలు పట్టాల వెంబడి పాపయ్య మృతదేహం గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చారు. ప్రమాదవశాత్తు రైలు ఢీకొని పాపయ్య మృతి చెందినట్టు స్థానికులు భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు..

అశ్వాపురం: మండల పరిధిలోని జగ్గారం గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. జగ్గారం గ్రామానికి చెందిన బాలిన రాజేష్ బైక్‌పై అశ్వాపురం నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మంచికంటినగర్ వద్ద అకస్మాత్తుగా అడ్డుగా వచ్చిన గేదెను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానికులు మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఐటీడీఏ రోడ్డుకు చెందిన ఆర్‌ఎంపీ నాగేశ్వరరావుపై ముగ్గురు వ్యక్తులు అకారణంగా దూషించి, దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రసాద్ యాదవ్, కుమారితోపాటు మరో యువతిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ నాగరాజు తెలిపారు.

5 కేజీల గంజాయి స్వాధీనం

పినపాక: పోలీసులు ఆదివారం ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ శివప్రసాద్ కథనం ప్రకారం.. ఉప్పాక బ్రిడ్జి వద్ద సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా జానంపేట గ్రామానికి చెందిన బానోతు రాజ్ కుమార్, మణుగూరు మండలానికి చెందిన దుంపటి సాయికుమార్, కురివి ఉమేష్ రెండు ద్విచక్ర వాహనాలపై గంజాయి తీసుకుని మణుగూరు నుంచి జానంపేట వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 1.05 లక్షలు ఉంటుందని అంచనా. రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి, గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మద్యం సీజ్

దమ్మపేట: ఎన్నికల నిబంధనల మేరకు చేస్తున్న తనిఖీల్లో పట్టుబడిన మద్యంను ఎఫ్ఎస్ టీం అధికారి కృష్ణ సీజ్ చేశారు. సోమవారం మండలంలోని చిన్నగొల్లగూడెం గ్రామశివారులో అనుమానాస్పదంగా బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని పోలీసులు ఆపేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో బైక్‌పై ఉన్న వ్యక్తి 95 క్వార్టర్ల బాటిళ్లమద్యంతోపాటు ద్విచక్రవాహనాన్ని వదిలేసి పరారయ్యాడు. మద్యం బాటిళ్లను ఎఫ్ఎస్ టీం అధికారి స్వాధీనం చేసుకుని సీజ్ చేసిన అనంతరం ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు.



స్వాధీనం చేసుకున్న బాటిళ్లతో ఉద్యోగులు

పాల్వంచలో..

పాల్వంచ : అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని తోగ్గూడెంలో వాంకుడోత్ శంకర్ అక్రమంగా నిల్వ ఉంచిన 30 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రూరల్ ఎస్ఐ కార్తీక్ తెలిపారు.

అమెరికాలో చదువే టాప్ చాయిస్

అమెరికాలో ఉన్నత విద్య కోసం భారతీయ విద్యార్థుల క్యూ...

- 2022–23 విద్యా సంవత్సరంలో యూఎస్ వెళ్లిన 2,68,923 విద్యార్థులు
- గత విద్యా సంవత్సరంతో పోలిస్తే 35% పెరుగుదల
- అమెరికాలో చదువుతున్న విదేశీ విద్యార్థుల్లో 25 శాతం భారతీయులే
- వెల్లడించిన ఓపెన్ డోర్స్ రిపోర్ట్ నివేదిక



సాక్షి, హైదరాబాద్: కొలువులు, చదువుల కోసం మనోళ్లు విదేశాలకు క్యూ కడుతూనే ఉంటారు. అయితే, విదేశాల్లో విద్యాభ్యాసానికి భారతీయ విద్యార్థుల టాప్ చాయిస్‌గా మాత్రం అమెరికానే ఉంటోంది. యూఎస్‌లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వెళ్లే విద్యార్థుల సంఖ్య క్రితం విద్యా సంవత్సరంతో పోలిస్తే.. 2022–23 విద్యా సంవత్సరంలో 35 శాతం పెరగడమే ఇందుకు నిదర్శనం. 2022–23లో అమెరికాలోని పలు యూనివర్సిటీల్లో విద్యనభ్యసించేందుకు 2,68,923 మంది విద్యార్థులు వెళ్లినట్టు సోమవారం విడుదలైన ఓపెన్ డోర్స్ రిపోర్ట్ (ఓడీఆర్) నివేదికలో వెల్లడైంది. ఈ నివేదికలోని వివరాలను భారత్‌లోని యూఎస్ ఎంబసీ, కాన్సులేట్ కార్యాలయం తమ అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొనడం గమనార్హం. అమెరికాలో విద్యాభ్యాసం చేస్తున్న 10 లక్షల మంది విదేశీ విద్యార్థుల్లో 25 శాతం మంది భారతీయ విద్యార్థులే అని ఓడీఆర్ వెల్లడించింది.

63 శాతానికి చేరిన గ్రాడ్యుయేషన్ విద్యార్థులు..

ఓపెన్ డోర్స్ రిపోర్ట్ డేటా ప్రకారం, యునైటెడ్ స్టేట్స్‌లో అంతర్జాతీయ గ్రాడ్యుయేట్ విద్యార్థుల సంఖ్యలో భారత్ చైనాను అధిగమించింది. క్రితం సంవత్సరంతో పోల్చితే 2022–23 విద్యా సంవత్సరంలో భారతీయ గ్రాడ్యుయేట్ విద్యార్థుల సంఖ్య 63 శాతం పెరిగి 1,65,936 మందికి చేరుకుంది. దాదాపు 64,000 మంది విద్యార్థులు పెరిగారు. అదే సమయంలో భారతీయ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు సైతం 16 శాతం పెరిగారు. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)ను అభ్యసించే వారి సంఖ్య 69,062కు చేరడంతో అమెరికాలో విద్యాభ్యాసం చేసే విదేశీ విద్యార్థుల్లో భారత్ అగ్రగామిగా నిలిచింది. ఓపీటీ అనేది ఒక రకమైన తాత్కాలిక పని అనుమతి. ఇది అర్హత కలిగిన విద్యార్థులు వారి అధ్యయన రంగానికి సంబంధించిన అనుభవాన్ని పొందడానికి అక్కడ విద్యాభ్యాసం చేసేందుకు ఈ విధానంలో అనుమతి లభిస్తుంది.

ఈ ఏడాది జూన్–ఆగస్టులో అత్యధిక వీసాలు జారీ..

అమెరికా యూనివర్సిటీల్లో విద్యాభ్యాసం కోసం వెళ్లే విద్యార్థులకు ఎఫ్, ఎం, జే కేటగిరీల్లో వీసాల జారీ సైతం ఈ ఏడాది జూన్–ఆగస్టులో గణనీయంగా పెరిగింది. భారత దేశవ్యాప్తంగా ఉన్న యూఎస్ కాన్సులేట్, ఎంబసీల ద్వారా మొత్తం 95,269 వీసాలు జారీ అయ్యాయి. 2022లో జూన్–ఆగస్టులో జారీ చేసిన వీసాలతో పోలిస్తే ఇది 18 శాతం అధికం.

అమెరికాలో చదువు అంటే విలువైన పెట్టుబడే..



'అమెరికాలోని యూనివర్సిటీల్లో విద్యాభ్యాసం అన్నది విద్యార్థులకు, వారి కుటుంబాలకు ఓ విలువైన పెట్టుబడి లాంటిదే. ఉజ్వల భవిష్యత్తు దిశగా ఈ విద్యార్థులంతా యూఎస్, భారత్‌ను మరింత దగ్గర చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పోటీ పడేందుకు విద్యార్థులను సిద్ధం చేసే భారతీయ విద్యా వ్యవస్థ బలం హర్షణీయం. విద్యాభ్యాసం కోసం యూఎస్ వచ్చే విద్యార్థుల్లో మహిళల సంఖ్య మరింత పెరగాలని మేం ఆశిస్తున్నాం'.

– యూఎస్ అంబాసిడర్ ఎరిక్ గార్సెట్టి

ఉచిత సలహా కేంద్రాలు..

అమెరికాలో చదువుకోవాలనుకునే విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు న్యూఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, ముంబైల్లో ఒక్కొక్కటి, హైదరాబాద్‌లో రెండు కేంద్రాలు కలిపి మొత్తం ఆరు కేంద్రాలు ఉన్నాయి. అమెరికాలో విద్యాభ్యాసంపై వివరాల కోసం ఎడ్యుకేషన్‌యూఎస్‌ఏ ఇండియా యాప్ సైతం ఐఓఎస్, ఆండ్రాయిడ్ డివైజ్‌లలో అందుబాటులో ఉన్నట్టు యూఎస్ ఎంబసీ అధికారులు తెలిపారు. ఈ యాప్‌లో కళాశాల దరఖాస్తు ప్రక్రియ గురించి తాజా సమాచారం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. https://educationusa.state.gov/country/in. వెబ్‌సైట్‌లోనూ పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయని వారు పేర్కొన్నారు.

విద్యార్థుల జోరు ఇలా...

ఓపెన్ డోర్స్ రిపోర్ట్ నివేదిక	2021-21 విద్యా సంవత్సరం	2022-23 విద్యా సంవత్సరం	పెరుగుదల (%)
యూఎస్‌కు వెళ్లిన మొత్తం భారతీయ విద్యార్థులు	1,99,182	2,68,923	35
అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు	27,545	31,954	16
గ్రాడ్యుయేషన్ విద్యార్థులు	1,02,024	1,65,936	62.6
ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)	68,188	69,062	1.3

'ఆల్మట్టి'పై పునరాలోచన చేయాలి

- ఆల్మట్టి నుంచి కర్ణాటకకు 16 టీఎంసీలు మళ్లిస్తే తెలంగాణకు నష్టం
- జూరాల, శ్రీశైలంకు వచ్చే వరద ప్రవాహానికి గండి పడుతుంది
- కృష్ణా ట్రిబ్యునల్–1 తీర్పు, కృష్ణా ట్రిబ్యునల్–2 నివేదికలకు ఉల్లంఘన
- నదుల అనుసంధానంపై ఎన్‌డబ్ల్యూడీఏ డీజీకి తెలంగాణ ఈఎన్‌సీ లేఖ

సాక్షి, హైదరాబాద్: గోదావరి–కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా.. కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయం నుంచి ప్రత్యామ్నాయ పద్ధతిలో ఆ రాష్ట్రానికి 16 టీఎంసీలను కేటాయించాలనే ప్రతిపాదనలపై తెలంగాణ రాష్ట్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రతిపాదనలతో ఆల్మట్టి జలాశయం నుంచి దిగువన ఉన్న తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలకు గండిపడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. కృష్ణా ట్రిబ్యునల్–1 తీర్పు, కృష్ణా ట్రిబ్యునల్–2 నివేదికలకు విరుద్ధమైన ఈ ప్రతిపాదనలపై పునరాలోచన చేయాలని కోరింది. నదుల అనుసంధానంపై నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఈ నెల 10న హైదరాబాద్‌లోని జలసౌధలో సంబంధిత రాష్ట్రాలతో సంప్రదింపుల సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ తెలంగాణ వాదనలను పేర్కొంటూ అదే రోజు ఎన్‌డబ్ల్యూడీఏకు లేఖ రాశారు.

ఆ హక్కు కర్ణాటకకు లేదు

ప్రత్యామ్నాయ పద్ధతిలో ఆల్మట్టి నుంచి కర్ణాటకలోని మల ప్రభ సబ్ బేసిన్‌కు 16 టీఎంసీల కేటాయింపుతో జల నిబంధనల అమలులో పూర్తి సంక్లిష్టమైన పరిస్థితులు ఉత్పన్న మవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా ట్రిబ్యునల్–1 గంపగుత్తగా జరిపిన కేటాయింపుల మేరకు జూరాల, శ్రీశైలం జలాశయాలకు రావాల్సిన జలాలను వినియోగించుకునే హక్కు కర్ణాటకకు లేదని స్పష్టం చేశారు. కృష్ణా బేసిన్ పరిధిలోని సాగునీరు అందని ప్రాంతాలు పెద్ద ఎత్తున ఉండగా, వాటిని విస్మరించి కృష్ణా జలాలను పెన్నా బేసిన్‌కు తరలించడం సబబు కాదని ఆక్షేపించారు. గోదావరి బేసిన్ లోని 968 టీఎంసీల నికర జలాల వినియోగానికి సంబంధించి రాష్ట్రం ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించిందని, ఈ ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు ఇచ్చిన తర్వాతే నదుల అనుసంధానం విషయంలో ముందుకు వెళ్లాలని సూచించారు. నదుల అనుసంధానంలో భాగంగా గోదావరి జలాలను నాగార్జునసాగర్‌లోకి ఎత్తిపోయాలని ప్రతిపాదించడంతో సాగర్‌లో కృష్ణా జలాల నిల్వలపై ప్రభావం పడనుందని పేర్కొన్నారు. వెనకబడిన మహబూబ్‌నగర్ జిల్లాలో 30లక్షల ఎకరాలు, నల్లగొండ జిల్లాలో 20.3లక్షల ఎకరాలు, రంగారెడ్డి జిల్లాలో 12.2 లక్షల ఎకరాలకు ఇంకా సాగునీరు అందలేదని వివరించారు. ఈ మూడు జిల్లాల్లో సాగుకు యోగ్యమైన 86శాతం భూములకు సాగునీటి సదుపాయం లేదని పేర్కొన్నారు.

50% జలాలు కేటాయించాలి...

గోదావరి–కావేరి, బెడ్తి–వార్దా నదుల అనుసంధానంతో తరలించనున్న 166 టీఎంసీల్లో 50 శాతం తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాలని కోరగా, కేవలం 45 టీఎంసీలు(27శాతం) మాత్రమే కేటాయించినట్టు ఈఎన్‌సీ మురళీధర్ తెలిపారు. కేటాయింపులను 50శాతానికి పెంచాలని కోరారు. కృష్ణా ట్రిబ్యునల్–1 తీర్పులోని 15(బీ) నిబంధన మేరకు బెడ్తి–వార్దా నదుల అనుసంధానం ద్వారా తరలించనున్న 18 టీఎంసీల్లో 50శాతం .. అంటే 9టీఎంసీలను తెలంగాణకు కేటాయించాలని తెలిపారు. ఇచ్చంపల్లి వద్ద నుంచి కాకుండా సమ్మక్క బ్యారేజీ నుంచి గోదావరి జలాలను తరలించాలని సూచించారు. ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మిస్తే దిగువన ఉన్న సమ్మక్క బ్యారేజీ నిర్వహణలో సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ వాడుకోని 148 టీఎంసీలనే గోదావరి–కావేరి అనుసంధానంలో భాగంగా తరలించనున్నట్టు కేంద్రం పేర్కొంటున్న నేపథ్యంలో.. ఈ మేరకు ఛత్తీస్‌గఢ్ నుంచి సమ్మతి తీసుకోవాలని కోరారు.

ఏపీలో కుల గణనకు నాంది

రేపు 5 ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా కుల గణన ప్రారంభం

- 3 గ్రామ సచివాలయాలు, 2 వార్డు సచివాలయాల పరిధిలో మొదలు
- రెండు రోజులు ప్రయోగాత్మకంగా కుల గణన
- కుల గణనపై ఈ నెల 22 వరకు శిక్షణ
- బుధవారం నుంచే జిల్లా స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశాలు
- విశాఖ, రాజమండ్రి, విజయవాడ, కర్నూలు, తిరుపతిలో ప్రాంతీయ సదస్సులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణనకు బుధవారం నాంది పలకనుంది. రాష్ట్రంలో ఐదు సచివాలయాల పరిధిలో ప్రయోగాత్మకంగా కుల గణన చేపట్టనుంది. బుధ, గురువారాల్లో రెండు రోజులు గ్రామీణ ప్రాంతాల్లో మూడు గ్రామ సచివాలయాలు, పట్టణ ప్రాంతాల్లో రెండు వార్డు సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం జరుగుతుంది. సంబంధిత జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో కుల గణన చేపట్టాలని రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఆధ్వర్యంలో కుల గణన చేపట్టడానికి ఈ నెల 3న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. కుల గణన ముందస్తు షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రణాళిక శాఖ కార్యదర్శి ఎం. గిరిజా శంకర్ ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల శాఖ, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖలతో పాటు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం ఉన్న వివిధ శాఖాధిపతులు, అన్ని జిల్లాల కలెక్టర్లకు తెలియజేస్తూ యూవో నోట్ విడుదల చేశారు. ముందస్తుగా ఐదు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా కులగణన చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో వెల్లడైన అభిప్రాయాలు, సూచనలతో అవసరమైతే మార్పులు చేసి, పూర్తి స్థాయిలో కులగణన చేపట్టనున్నట్లు సమాచారం.

సిబ్బందికి శిక్షణ

రాష్ట్రవ్యాప్తంగా కుల గణనలో ఎన్యూమరేటర్లుగా వ్యవహరించే సచివాలయాల సిబ్బందితో పాటు సూపర్‌వైజర్లు, మండల, మున్సిపల్ స్థాయి అధికారులు, పర్యవేక్షణ చేసే జిల్లా, డివిజన్ స్థాయి అధికారులకు మూడు విడతల్లో ఈ నెల 22 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. వీరికి శిక్షణ ఇచ్చే మాస్టర్ ట్రైనర్లకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఆధ్వర్యంలో మంగళ, లేదా బుధవారం శిక్షణ ఇచ్చే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

రేపటి నుంచే రౌండ్ టేబుల్ సమావేశాలు

కుల గణనపై ప్రభుత్వం బుధవారం నుంచి జిల్లాల వారీగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించనుంది. బుధ, గురువారాల్లో జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో సంబంధిత భాగస్వామ్యులతో ఈ సమావేశాలు జరుగుతాయి. ఆ తర్వాత ఐదు ప్రాంతీయ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాలు జరపనున్నారు. ఈ నెల 17న రాజమండ్రి, కర్నూలులో, 20న విశాఖ, విజయవాడలో, 24న తిరుపతిలో ప్రాంతీయ సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర ప్రణాళిక శాఖ ఇప్పటికే కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. ప్రాంతీయ సదస్సులు జరిగే ఐదు జిల్లాల్లో ప్రత్యేకంగా జిల్లా స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశాలు ఉండవని రాష్ట్ర ప్రణాళిక శాఖ స్పష్టం చేసింది.

నేడు అల్పపీడనం!

16న వాయుగుండంగా మారే అవకాశం

సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో మంగళవారం అల్పపీడనం ఏర్పడనుంది. అనంతరం పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ ఈ నెల 16వ తేదీ నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడనుంది. మరోవైపు నైరుతి బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. అలాగే ఏపీపైకి ఈశాన్య గాలులు వీస్తున్నాయి. వీటన్నిటి ఫలితంగా మంగళ, బుధవారాల్లో ఉత్తర కోస్తాలో ఒకట్రెండు చోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. కాగా.. మంగళవారం తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. అలాగే బుధవారం తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలకు ఆస్కారం ఉందని తెలిపింది.

జిల్లా వార్తలు

జాతీయ స్థాయి స్పోర్ట్స్ మీట్‌తో ప్రతిభ



అథ్లెట్లను అభినందిస్తున్న డీవైఎస్‌ఓ, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: తమిళనాడు రాష్ట్రం కోయబత్తురులో జరిగిన జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్ మీట్‌లో ఖమ్మంకు చెందిన అథ్లెట్లు పతకాలు సాధించారు. జూనియర్ బాలికలలాంగ్ జంప్, హెప్టాథిలిన్‌లో బి.వైశాలి, లాంగ్‌జంప్‌లో ఎ.మనుశ్రీ, ఎ.మైథిలి పతకాలు సాధించారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న బాలికలు పతకాలు సాధించడంపై సోమవారం డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి అభినందించారు. సీనియర్ అథ్లెటిక్ అకాడమీ కోచ్ ఎం.డీ.గౌస్, అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్‌తో పాటు సుధాకర్, కృష్ణయ్య, ఎన్.వెంకటేశ్వర్లు, రవి, హాలీం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉషూ టోర్నీలో..

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–17, 19 ఉషూ టోర్నీలో ఖమ్మం జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఆయా విభాగాల్లో వై.సుశాంత్, జె.భరత్, బి.అభిలాష్, ఎం.రాకేష్, పి.అజయ్‌కుమార్ పతకాలు సాధించారు. వీరిని డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, ఉషూ జిల్లా కార్యదర్శి పి.పరిపూర్ణాచారి అభినందించారు.

గుంటు మల్లన్న ఆలయంలో ఆకాశ దీపం



ఆకాశ దీపాన్ని ధ్వజస్తంభం పైకి లాగుతున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: కార్తీక మాసం ఉత్సవాలను పురస్కరించుకుని ఖమ్మంలోని శ్రీ భ్రమరాంబ, శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం రాత్రి ఆకాశ దీపం కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణ శర్మ, ఈఓ చందూరు రామకోటేశ్వరరావు ధ్వజస్తంభం వద్ద, ఆకాశ దీపానికి పూజలుచేశారు. అనంతరం ఆకాశ దీపాన్ని పూలమాలలతో ధ్వజస్తంభంపై ఆవిష్కరించారు.

దీపారాధన.. ఉపవాసం



విద్యుత్ లైట్లతో ముస్తాబైన ఖమ్మంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి ఆలయం

కార్తీకమాసం ఎంతో ప్రత్యేకం

- నేటి నుంచి డిసెంబర్ 13 వరకు..
- భక్తిశ్రద్ధలతో పూజిస్తే హరిహరుల అనుగ్రహం

కొత్తగూడెంటౌన్/భద్రాచలంటౌన్/ఖమ్మం గాంధీచౌక్: హిందూ సంప్రదాయంలో కార్తీకమాసానికి విశిష్ట ప్రాధాన్యం ఉంది. కార్తీక మాసాన్ని వ్రతాల మాసంగా కూడా పిలుస్తారు. మంగళవారం (14న) ప్రారంభం కానున్న కార్తీకమాసం డిసెంబర్ 13న ముగియనుంది. ఈ సమయంలో పూజలు చేస్తే పుణ్యఫలాలు లభిస్తాయని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతుంటారు. ఇక పెళ్లికాని యువతులు తులసి మొక్కను పూజిస్తే.. పెళ్లిళ్లు జరుగుతాయని పలువురు విశ్వసిస్తుంటారు.

పూజనీయమైన మాసం..

కార్తీకమాసం హరిహరాదులకు ప్రీతికరం. కార్తీక మాసం ప్రత్యేక పూజానీయమైనదని విశ్వాసం. ఈ మాసం ప్రాముఖ్యతను స్కంద పురాణాల్లో వివరించారు. ఈ నెలలో మహిళలు ఇళ్ల, ఆలయాల్లోనూ పవిత్రంగా పూజలు చేస్తారు. దీపారాధనలు, హోమం, అభిషేకం, సామూహిక కుంకుమార్చన తదితతర పూజలు నిర్వహిస్తారు. ఆలయాలు భక్తుల కోలాహలంతో సందడిగా మారతాయి. ఈ మాసంలో సూర్యచంద్రుల కిరణాలు మనస్సుకు, శరీరానికి మంచి ఫలితాలను ఇస్తాయని హిందూ భక్తులు విశ్వసిస్తారు. చాలా మంది శ్రీకృష్ణుడికి దీపాలు వెలిగించి పూజిస్తారు.

బ్రహ్మ ముహూర్తం..

యమునా నదిలో లేదా కార్తీకమాసంలో ఏదైన పవిత్ర నదిలో బ్రహ్మ ముహూర్తంలో స్నానం, లేదా నదీ నీళ్లను స్నానం చేసే నీళ్లతో కలిపి చేయడం వల్ల పుణ్యం లభిస్తుందని భక్తులు విశ్వసిస్తుంటారు. ఈ మాసంలో మహిళలు ఉదయాన్నే లేచి స్నానం చేస్తారు. పెళ్లైన వారు తమ పసుపుకుంకుమలు నూరేళ్లు చల్లగా ఉండాలని, భర్త, పిల్లలు, కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో జీవించాలని, పెళ్లికాని యువతులు తమకు అన్ని విధాలా, మంచి గుణగణాలు ఉన్న వరుడు భర్తగా రావాలని, మంచి చదువులు కావాలని, ఉద్యోగంలో రాణించాలని కోరుకుంటారు.

ఉపవాసం అత్యంతపవిత్రం

కార్తీకమాసం ప్రారంభమైన రోజు నుంచి పూర్తయ్యే వరకు నెల రోజులపాటు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజించి ఉపవాసాలు చేస్తారు. ఈ నెలలో ఉపవాసం అత్యంత పవిత్రమైనదిగా పరిగణిస్తారు. మాంసాహారాన్ని పూర్తిగా మానివేస్తారు. రోజూ శాకాహారం తీసుకుంటారు.

నియమనిష్టలతో..

కార్తీక మాసంలో నియమనిష్టలతో పూజలు చేస్తారు. అందుకే భక్తులు ఈ మాసంలో అయ్యప్ప, శివమాలధారణ చేస్తారు. ఎంతో నిష్టగా ఉంటారు. కార్తీక మాసంలో పాటించే సంప్రదాయాలతో ఆరోగ్యం, పరోపకారం, వనభోజనాలతో ఖ్యాతి, సద్బుద్ధిని కలుగజేస్తాయి.

– రమాదేవి, భద్రాచలం

భక్తిశ్రద్ధలతో పూజిస్తే పుణ్యఫలం



ఆడపడుచులకు అత్యంత ఇష్టమైన మాసం ఇది. ఈ సమయంలో నెల రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో దీపారాధన చేసి పూజించడంతో ఉపవాసం పాటిస్తే శివుడు, విష్ణువుల అనుగ్రహం ఉంటుంది. కార్తీక మాసంలో పూజలు చేస్తే పుణ్యం లభిస్తుంది.

– రాధాకృష్ణశర్మ, గణేష్‌టెంపుల్, కొత్తగూడెం

ఇవీ ప్రత్యేకం

ఈ నెల 14న మంగళవారం ఆకాశదీప ప్రారంభం	
17న	నాగుల చవితి
20న	మొదటి సోమవారం
24న	శుక్రవారం క్షీరాబ్ది ద్వాదశి
26న	ఆదివారం జ్వాలా తోరణం
27న	రెండో సోమవారం
	కార్తీక పౌర్ణమి
4న(డిసెంబర్)	మూడవ సోమవారం
11న	నాలుగో సోమవారం

ఆలయాల్లో సందడి..

కార్తీకమాసం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించనున్నారు. కొత్తగూడెం గణేష్‌టెంపుల్, రైటర్‌బస్తీలోని శ్రీమాతాశక్తి పంచాయత క్షేత్రం, బూడిదగడ్డబస్తీలోని శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి ఆలయం, రామవరంలోని సీతారామహనుమశ్శివాలయం, సింగరేణి హెడ్ ఆఫీస్ వద్ద ఉన్న శ్రీకనకదుర్గ మహేశ్వరీ దేవి అమ్మవారి ఆలయం, రుద్రంపూర్‌లోని శివాలయం, విద్యానగర్‌కాలనీలోని శివాలయం, లక్ష్మీదేవిపల్లి శ్రీచండీ సర్వజ్ఞ పీఠం తదితర ఆలయాల్లో భక్తులు కార్తీకమాసం సందర్భంగా ఘనంగా పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు.

బాలలు.. అదరగొట్టారు!



బాలోత్సవ్ పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ శర్మ, పక్కన నిర్వాహకులు

- మధిరలో ప్రారంభమైన జాతీయస్థాయి బాలోత్సవ్
- తొలిరోజు శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మధిర: ఖమ్మం జిల్లా మధిరకు చెందిన రామభక్త సీతయ్య కళాపరిషత్ ఆధ్వర్యాన 26వ జాతీయస్థాయి మధిర బాలోత్సవ్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. మధిరలోని శ్రీ లక్ష్మీపద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారి కల్యాణమండపంలో ఏర్పాటుచేసిన ఈ పోటీలను డీఈఓ సోమశేఖర శర్మ ప్రారంభించి మాట్లాడారు. కళాకారులను ప్రోత్సహించేందుకు కళా పరిషత్ ఆధ్వర్యాన ఏళ్లుగా పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. పిల్లలు చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ రాణించేలా తల్లిదండ్రులు శిక్షణ ఇప్పించాలని సూచించారు. ఆతర్వాత ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని మాట్లాడగా, ఎంఈఓ వై.ప్రభాకర్, కళా పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, బాబ్జాతో పాటు సభ్యులు మారోని బాయి, సోనీబాయి, ఝాన్సీబాయి, ఉమాప్రసన్న, దినకర్, మేఘశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కళానైపుణ్యం

బాలోత్సవత్ పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఇతర జిల్లాల విద్యార్థులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా తొలిరోజు శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాల పోటీలు జరిగాయి. సంప్రదాయ దుస్తులు ధరించిన తమ హావభావాలతో కళా నైపుణ్యాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈపోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల వ్యతిరేకిగా కాంగ్రెస్

మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ పార్టీయే సర్వస్వం అనుకుని యాభై ఏళ్ల పాటు పార్టీ కోసం పనిచేసిన తనకు ఇంత వరకు సొంత ఇల్లు సైతం లేదని, అంతలా సేవ చేసిన తనను పార్టీ ఇప్పుడు అనాథలా మార్చి బయటకు నెట్టిందని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌లో ఎదురైన అవమానంతోనే బీఆర్‌ఎస్ నాయకుల ఆహ్వానం మేరకు ఆ పార్టీలో చేరానని తెలిపారు. 2018లో సత్తుపల్లి టికెట్ ఇస్తామని చెప్పి పొత్తులో భాగంగా టీడీపీకి ఇచ్చినా అభ్యర్థి తరఫున విస్తృత ప్రచారం చేశానని చెప్పారు. ఇప్పుడు సత్తుపల్లి టికెట్‌ను డబ్బు ఉన్న వారికి, జెండా పట్టని వాళ్లకు ఇచ్చి మరోమారు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో ఎన్నో పదవులు అనుభవించడమే కాక, పార్టీకి మరెన్నో విజయాలు అందించానని, మాట మాత్రం చెప్పకుండా ఇతరులకు టికెట్ ఇవ్వడమంటే తనను అవమానించినట్లేనని సంభాని తెలిపారు. కాగా, బీఆర్‌ఎస్‌లో చేరింది పదవులు, డబ్బు కోసం మాత్రం కాదని చెప్పారు. కేసీఆర్‌ను కలిసినప్పుడు సీతారామ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయాలని కోరగా స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, నాయకులు గుండాల కృష్ణ, డోకుపర్తి సుబ్బారావు, అమరగాని వెంకన్న, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాల విద్యార్థినుల ఆందోళన



ఆందోళనకు దిగిన విద్యార్థినులు

కొణిజర్ల: వంట సరిగా వండటం లేదని, రుచిగా లేక తినలేకపోతున్నామని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదంటూ మండలంలోని తనికెళ్లలో గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు సోమవారం ఆందోళనకు దిగారు. తనికెళ్లలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కొనసాగుతుండగా 250 మంది బాలికలు చదువుతున్నారు. కొన్ని రోజులుగా భోజనం సరిగా లేదని వీరు చెబుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆందోళన చేపట్టారు. దీంతో ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాదేవి చేరుకుని మాట్లాడగా, వంట ఏజెన్సీని మార్చాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ప్రిన్సిపాల్ చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.